## క్లుప్తంగా

### మట్టి పరీక్షలు నిర్వహించాలి

**మరికల్:** వానకాలంలో పంటలు సాగు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారులు మట్టి పరీక్షలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ పరీక్షలు నిర్వహిస్తేనే భూమిలో ఏ పంట సాగు చేయాలనే విషయం తెలుస్తుందన్నారు. ప్రతి రైతుకు చెందిన భూములను అధికారులు పరీక్షలు నిర్వహించి ఏ పంటలు సాగు చేయాల్లో రైతులకు సూచించాలన్నారు. లేకుంటే వేసిన పంటలు సరిగా రాక అన్నదాతలు నష్టపోవాల్సి వస్తుందన్నారు.

### మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరామర్శ



**మాగనూర్(మక్తల్):** మక్తల్ పట్టణంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మక్తల్ మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన పద్మమ్మ అనే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదివారం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు చిన్న హన్మంతు, జుట్ల శంకర్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు భూమి పూజ



**కొత్తపల్లి:** మండల పరిధిలోని నిడ్జింత గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి రెడ్డి కోస్గి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో భూగర్భ మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో వాటి నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి, నాగేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

### నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

**హన్వాడ:** మండల కేంద్రంలోని ది ఎవరెస్ట్ టాలెంట్ స్కూల్‌లో సోమవారం కాంగ్రెస్ కార్య కర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ పరిశీలకులు సాంబయ్య, భాస్కర్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఎన్పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి వస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

### బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**కృష్ణా:** మండలంలోని కుసుమర్తిలో మొసలి దాడి చేయడంతో మరణించిన రైతు తిప్పణ్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు శివరాజ్‌పాటీల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మోటార్ మరమ్మతుల కోసం భీమ నదిలో దిగిన రైతు తిప్పణ్ణను మొసలి లాక్కెళ్లి ఒక రోజు గడిచినా ఇంత వరకు మృతదేహాన్ని గుర్తించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతు కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

### రేపు సవారమ్మ ఉత్సవం



**అమరచింత:** పట్టణ శివారులో వెలసిన సవారమ్మ దేవత ఉత్సవాలు ఈనెల 20వ తేదీన మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జాతర నిర్వహించి బోనాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# కళతప్పిన క్రీడా ప్రాంగణాలు




ఎలిగండ్లకు రెండు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

- వసతులు లేక నిరుపయోగం
- ఊళ్లకు దూరంగా ఉండటమే కారణం
- ఖాళీ స్థలాల్లో వేసవి ఆటలు

**మరికల్:** క్రీడలను ప్రోత్సహించడానికి గత ప్రభుత్వం నిర్మించిన క్రీడా ప్రాంగణాలు కళతప్పాయి. ఒక్కో మైదానానికి దాదాపు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసి పల్లెలు, పట్టణాల్లో గత ప్రభుత్వం అనేక క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. అయితే అధికారులు మైదానాల్లో వసతుల లేమిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. దీంతో వేసవి సెలవుల్లో చిన్నారులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ ఆటల్లో మునిగి తేలుతున్నారు. వసతుల లేమి గ్రామాలకు దూరంగా మైదానాలు ఏర్పాటు చేయడంతో క్రీడా ప్రాంగణాల్లో మాత్రం సందడి కనిపించడం లేదు. ఇటీవల కురిసిన పెద్ద వానలకు చాలా చోట్ల వాటి రూపాన్ని కోల్పోయాయి. అనేక చోట్ల లోతట్టు ప్రాంతాల్లో వీటిని నిర్మించడంతో నీరు చేరి వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

**ఇబ్బందులు అనేకం..**

- ఊరికి దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. రాళ్ల మధ్యన గుట్టల చెంతన ఉండటంతో అక్కడికి వెళ్లి ఆటలాడే పరిస్థితి లేదు.
- కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వీటి స్థలాన్ని వినియోగిస్తున్నారు.
- ఎక్కువ ప్రాంగణాల్లో బోర్డులు మాత్రం పెట్టి ఆటలకు సంబంధించిన ఉపకరణాల్ని అమర్చకుండా వదిలేయడంతో వినియోగించుకోలేని పరిస్థితి.
- పల్లెల్లో ఎక్కువగా చెరువు శిఖం స్థలాలు, లోతట్టు ప్రాంతాలను మైదానాలుగా మార్చి మమ అనిపించి వసతుల్ని మరిచారు.
- చదును చేయకుండానే వదిలి పెట్టడంతో అనేక చోట్ల మైదానాలు ఎగుడు దిగుడుగా ఉండడంతో ఆటలకు ఉపయోగపడటం లేదు. నిర్వహణ విషయంలో నిధుల ఊసే లేకపోవడంతో వాటిని ఎవరూ ఉపయోగించడం లేదు.
- లాంగజంప్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆడేందుకు ఏర్పాటు చేసిన సామగ్రి చాలా చోట్ల నిరుపయోగంగానే ఉంది. మరి కొన్ని చోట్ల క్రీడా సామగ్రి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.
- కనీసం పర్యవేక్షణ లేకపోవడం, ఆయా శాఖల మధ్య సమన్వయం లేక క్రీడాకారులకు శాపంగా మారింది.

### సౌకర్యాలు కల్పిస్తాం

క్రీడా ప్రాంగణాల నిర్మాణాలకు ఎక్కడ స్థలం ఇస్తే అక్కడే ఏర్పాటు చేయడం జరిగింది. ప్రధానంగా మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యలు ఏర్పాటు చేశాం. పల్లెల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యలు కల్పించాల్సింది. త్వరలోనే వాటిపై దృష్టి పెడతాం.

–మొగులప్ప, డీఆర్‌డీఓ, నారాయణపేట

### అధికారులు చొరవ చూపాలి



గత ప్రభుత్వం గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం వల్ల క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. అంతే కాకుండా కనీస సౌకర్యలు కూడా లేకపోవడంతో అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మరికల్‌లో అయితే బాలుర ఉన్నత పాఠశాలలో ఇరుకు స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం వల్ల ఆటలకు ఇబ్బందిగా మారింది. సౌకర్యలు కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలి.

–శ్రీకాంత్‌రెడ్డి, యువక మండలి అధ్యక్షులు, మరికల్

## విద్యార్థులు సహపాఠ్య కార్యక్రమాలలో పాల్గొనాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ బాలాజీ

**నారాయణపేట ఎడ్యుకేషన్:** విద్యార్థులందరూ సహపాఠ్య కార్యక్రమాలలో పాల్గొనాలని నారాయణపేట ఎంఈఓ బాలాజీ అన్నారు. ఆదివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌లో నేర్పించిన డ్రాయింగ్, కంప్యూటర్, ఎంబ్రాయిడింగ్ వంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్‌లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సింగ్, పరీక్షన్ వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మురుగుతో కంపు కొడుతున్న పశువుల సంత



పశువుల సంతలో నిలిచిన మురుగు

**కోస్గి:** మున్సిపల్ పరిధిలో ప్రతి ఆదివారం జరిగే పశువుల సంత నుంచి ఏటా రూ.లక్షలు ఆదాయం పొందుతున్న మున్సిపల్ అధికారులు సంతలో పరిశుభ్రతపై మాత్రం దృష్టి సారించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంత జరిగే ప్రాంతంలో మురుగు నీరు నిలిచి కంపు కొడుతుండటంతో తీవ్ర ఇబ్బందుల మధ్యనే రైతులు తమ పశువుల క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నారు. టెండర్ దక్కించుకొని మున్సిపాలిటీకి డబ్బులు కడుతున్నామని, సంత జరిగే ప్రాంతంలో పారిశుద్ధ్య, ఇతర శుభ్రత అంశాలు మున్సిపాలిటీ వారే చేపట్టాలని టెండర్‌దారులు చెబుతున్నారు. సంత జరిగే ప్రాంతంలో మురుగు విషయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల సంతలో ఉన్న మురుగును తొలగించాలని రైతులు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

**ఊట్కూర్:** మండలంలోని చిన్నపొర్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం 2010–11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులు భాస్కర్‌రెడ్డి, ఎస్.చందులాల్, రాజ్‌గోపాల్, జయశ్రీ, రవికుమార్, రఘువీర్, శ్రీనివాస్‌కు శాలువా, పూలమాలలతో సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆనంద్, సోయల్, మధుకర్, కవిత, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

### జింక పిల్లను కాపాడిన రైతు



**నర్వ:** మండలంలోని రాయికోడ్ గ్రామ శివారులో జింకపిల్ల లభ్యమైంది. కుక్కలు జింక పిల్లను వెంటాడుతుండగా గమనించిన ఓ రైతు దానిని కుక్కల బారి నుంచి కాపాడాడు. అనంతరం నర్వ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. జింక పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు.

### రాములుకు జాతీయ పురస్కార అవార్డు

**మహబూబ్‌నగర్ రూరల్:** మదాసి, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధన్వాడ రాములుకు జాతీయ పురస్కార అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా కళా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగేష్ మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి 2025 సందర్భంగా ఈ పురస్కారం అందించారు. కర్నూల్ పట్టణంలోని సీ క్యాంపు టీజీవీ కళాక్షేత్రంలో రాములుకు సామాజిక సేవా కార్యక్రమాల కింద జాతీయ పురస్కార అవార్డు అందజేసి సత్కరించారు.

### మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

**నవాబుపేట:** మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అడవిలో వెలసిన మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. భక్తుల సందడితో అడవి మొత్తం మైసమ్మ నామస్మరణతో హోరెత్తింది. అటు జిల్లా కేంద్రం, ఇటు మండల కేంద్రం ప్రధాన రోడ్లు జనంతో కిటకిటలాడాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

# వేసవి శిబిరాలతో సృజనాత్మకత వెలికితీత



ముగింపు వేడుకల్లో విద్యార్థులతో ఎంఈఓ బాలాజీ, ఉపాధ్యాయులు

**నారాయణపేట రూరల్:** మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును ఎంఈఓ బాలాజీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న కళలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి శిబిరాలు దోహదపడుతున్నాయన్నారు. చిత్రలేఖనం, నీతి కథలు, యోగ, డాన్స్, రంగు కాగితాలతో వివిధ ఆకారాలను తయారు చేయడం, అలాగే సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భాను ప్రకాష్, ఉపాధ్యాయులు భారతి, విజయ, రఘురాంరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో విద్యార్థులతో ఎంఈఓ కృష్ణారెడ్డి

**నర్వ:** మండలంలోని పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న కంప్యూటర్ బోధన, యోగా, చెస్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, క్రాఫ్ట్ మొదలైన అంశాలపై పోటీలు నిర్వహించారు. వీటితో పాటు వ్యాసరచన, ఉపాన్యాస పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన కళాకృతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు బాలకృష్ణ, గ్రామ పెద్దలు ఎస్‌ఎస్‌రాములు, కుర్వ లంకాల్ మహేష్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, శివప్ప, కొండన్న పాల్గొన్నారు.

**యంగ్ ఇండియా శిబిరం విజయవంతం**

**దామరగిద్ద:** విద్యార్థుల్లో దాగి ఉన్న వెలికితీసేందుకు యంగ్ ఇండియా ప్రత్యేక శిబిరం విజయవంతమైందని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మొగుల్‌మడ్క జెడ్పీ ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శిబిరాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. శిబిరంలో యోగా, క్రీడలు, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సబ్జెక్టుపై శిక్షణ తరగతు లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఏపీసీ చైర్మన్ అనురాధ పాల్గొన్నారు.

**ముగిసిన శిక్షణ శిబిరం**

**ధన్వాడ:** ధన్వాడ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గాయత్రి పాల్గొని శిక్షణకు సహకరించిన పలువురిని శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెలకువలతో భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

# కూలిన చెట్టు.. గేదె మృతి



రోడ్డుకు అడ్డుగా కూలిన చెట్టు



చెట్టు పడి మృతి చెందిన గేదె

**మాగనూర్:** మండల పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల భారీ చెట్లు అలాగే విద్యుత్ స్తంభాలు కుప్పకూలాయి. దీంతో పలు గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సకాలంలో గన్నీ బ్యాగులు అందించక కొందరు, లారీల సరఫరాలో ఆలస్యంతో మరికొందరి రైతుల ధాన్యం కలాల్లోనే ఉంచడంతో తడిసిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సేలేటి వెంకటేష్ తన గేదేను గ్రామ సమీపంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం దగ్గర చెట్టుకు కట్టేయగా చెట్టు కూలి గేదెపై పడడంతో మృతి చెందింది. గేదె మృతితో వెంకటేష్ కన్నీరుమున్నీరయ్యారు.

**దంచికొట్టిన వర్షం**

**నర్వ:** మండలంలో ఆదివారం సాయంత్రం ఆయా గ్రామాల్లో వర్షం దంచికొట్టింది. పెద్దకడ్మూర్ గ్రామాల్లోని పలు కాలనీల్లో రోడ్లన్నీ నీటిమయమయ్యాయి. డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడంతో మురుగు ఇళ్లలోకి వస్తుందని గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వర్షకాలం రానున్న నేపథ్యంలో కాలువలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వాల్మీకి బోయల హక్కులపై పోరాడుదాం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

**నర్వ:** వాల్మీకి బోయ హక్కుల సాధన కోసం ఐక్యతగా పోరాడుదామని వాల్మీకి బోయ సంఘం మండల అధ్యక్షుడు కావలి అయ్యన్న అన్నారు. ఆదివారం యాంకి గ్రామంలో వాల్మీకి బోయ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నారాయణ, ఉపాధ్యక్షుడిగా బాలరాజు, గుజ్జుల రాజు, ప్రధాన కార్యదర్శిగా దేశాయ్ మంగేష్, కార్యదర్శిగా కావలి అంజి, ప్రచార కార్యదర్శిగా గుజ్జుల శ్రీను, కోశాధికారిగా కాటే నరేందర్, కార్యవర్గ సభ్యులుగా బండి కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీను, కథలప్ప, అంజి, లింగన్న, కురుమన్న, రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ నూతన సభ్యులను సన్మానించారు.

## కేంద్ర విధానాలతోనే ధరల పెంపు



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

**ఊట్కూర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అమీన్‌పూర్, వల్లంపలి పగిడిమారి, ఓబ్లాపూర్, నిడుగుర్తి తదితర గ్రామాల్లో జూలై 19న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర పభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తప్పిదాల వల్లనే నిత్యావసర సరుకుల ధరలు వందశాతం పెరిగాయన్నారు. సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వెలగని లైట్లు.. చీకట్లో కాలనీలు



ఎస్సీ కాలనీలో వెలుగని విద్యుత్ దీపాలు

**కొత్తపల్లి:** కొత్తపల్లి మండల పరిధిలోని నిడ్జింత గ్రామ పంచాయతీలో ప్రతి వాడకు ఓ ఐమ్యాక్స్ చొప్పున రూ.16 లక్షలతో 8 లైట్లను ఏర్పాటు చేశారు. అయితే లైట్లు మరమ్మతుకు గురి కావడంతో గ్రామంలోని దళిత వాడలో ఏడాది నుంచి చీకట్లు కమ్ముకున్నాయి. గతేడాది లైట్లు వెలగడం లేదని రిపేరు కోసమని తీసిన లైట్లు నేటికి బిగించ లేదు. దళిత వాడలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తుండడంతో రాత్రి పూట చీకట్లో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా త్వరలోనే కొత్త వీధి దీపాలను బిగిస్తామన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**కృష్ణా:** మండలంలో కుసుమర్తిలోని భీమనదిలో రైతు జింకల్ తిప్పణ్ణను శనివారం ఓ మొసలి లాక్కెళ్లిన సంగతి తెలిసిందే. మోటార్ మరమ్మతు నిమిత్తం నదిలోకి వెళ్లిన తిప్పణ్ణను మొసలి నీటిలోకి లాక్కెళ్లింది. ఆయన మృతదేహం కోసం ఎంత గాలించినా లభించకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డితో కలిసి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వచ్చి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడతారన్నారు. అలాగే బాధిత కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు సంతోష్‌పాటిల్, ఆనంద్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్ఫరాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

## పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలి



సమస్యలు తెలుసుకుంటున్న కార్మిక సంఘం జిల్లా నాయకులు

**కోయిల్‌కొండ:** దేశంలో కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించి మద్దతు ధరల గ్యారంటీ చట్టం అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బూర్గుపల్లి, చిన్నలింగల్‌చేడ్, శేరివెంకటాపూర్, ఖాజీపూర్, కోయిల్‌కొండ గ్రామాలలో ఈనెల 20న జరిగే రైతు, కార్మిక సంఘాల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరప్రతాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గ్యారంటీ చట్టం అమలు చేయాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, ప్రతి కూలీకి కొలతలతో సంబంధం లేకుండా రూ.600 రోజు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి ఊశప్ప, సాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## జేపీఎల్ విన్నర్‌గా ‘పంచముఖ’



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్ క్రీడలు:** పట్టణ జాంగ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జాంగ్ర ప్రీమియర్ లీగ్–3 (జేపీఎల్) విన్నర్‌గా పంచముఖ ఆంజనేయ సంఘం జట్టు నిలిచింది. స్వామి వివేకానంద జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన స్వామి వివేకానంద జట్టు 8 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంచముఖ ఆంజనేయ సంఘం జట్టు 7.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి లక్ష్యాన్ని చేధించింది. విన్నర్, రన్నర్ జట్లకు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ జాంగ్ర యువజన సంఘం అధ్యక్షులు సద్దె పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి టంకశాల మల్లేష్, కోశాధికారి పోతినేపల్లి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు దోమ సాయికుమార్ పాల్గొన్నారు.